క్లుప్తంగా

నేషనల్ హైవే పనులు పరిశీలించిన జేసీ



అధికారులతో చర్చిస్తున్న జేసీ నవ్య

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిధిలోని గార్గేయపురం, నూతనపల్లె గ్రామ పరిధిలో జరుగుతున్న నేషనల్ హైవే పనులను బుధవారం జేసీ నవ్య పరిశీలించారు. మరింత భూమి అవసరం అయినందున రెవెన్యూ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. భూములకు సంబంధించిన వివరాలపై అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో చిరంజీవి, కర్నూలు తహసీల్దార్ రమేష్‌బాబు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు (రూరల్) : కర్నూలు మండలం ఉల్చాల గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సిరాజ్ సొంత డబ్బుతో విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు సత్రజున్నిసా చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. అదేవిధంగా రూ.16 వేలు విలువ మైకును సొంత డబ్బులతో కొనుగోలు చేసి పాఠశాలకు విరాళంగా అందజేశారు.

వరద బాధితులకు విరాళం



కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా విరాళం అంద జేస్తున్న హుసేనాపురం యువకులు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన యువకులు విజయవాడ వరద బాధితులకు విరాళం అందజేశారు. గ్రామంలోని హెచ్‌పీఎం సోల్జర్స్ ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన రూ.40 వేలను బుధవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదుగా సీఎంఆర్‌ఎఫ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యువకులను కలెక్టర్ యువతను అభినందించారు.

క్రీడలలో గెలుపు ఓటములు సహజం



వాలీబాల్ ఆడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు:క్రీడలలో గెలుపోటములు సహజమని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎంఈఓ, సర్పంచ్ హనుమక్క, ఎంపీటీసీ ఎం. శేషన్న ఆటల పోటీలను ప్రారంభించారు.

పారిశుద్ధ్య కూలీలకు వైద్య పరీక్షలు

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కూలీలకు బుధవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి సైపుల్లాబేగ్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కూలీలకు వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ సందీప్, ఏఎన్‌ఎం జ్యోతి పారిశుద్ధ్య కూలీలకు వైద్య బీపీ, సుగర్, హెచ్‌బీ తదితర పరీక్షలను చేశారు. అదేవిధంగా వారికి అవసరమైన మందులను అందజేశారు. అదేవిధంగా పీఎస్ గ్రామంలో మురుగు నీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

22న ఏపీటీఎఫ్ మహాసభ

గడివేముల: నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 22వ తేదీన నిర్వహించే ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలు, జిల్లా విద్యా వైజ్ఞానిక మహాసభను విజయవంతం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శిలు మానపాటి రవి, ఆవుల మునిస్వామి, జిల్లా మహిళా కార్యదర్శి కవిత ఉపాధ్యాయులను కోరారు. బుధవారం సాయంత్రం గడిగరేవులలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, 16ఏప్రిల్ 1944లో తూర్పుగోదావరి జిల్లా, తాపేశ్వరంలో ఆవిర్భవించిందన్నారు. సమావేశంలో గడివేముల మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలస్వామి, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, మల్లికార్జునయ్య, శ్రీరాములు, మారెన్న, లలితమ్మ, కోమలమ్మ, హరిత తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి అమలు చేయాలి



ఎన్నికలముందు సీఎం చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి ఇంటికి ఉద్యోగం, నిరుద్యోగులకు భృతి కింద రూ. 3,000లు ఇస్తామని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులందరికీ రూ. 3వేలు భృతి ఇవ్వాలి. ఈ ఏడాది సూపర్ సిక్స్ పథకాలు ఇవ్వలేమోనన్నట్లుగా చంద్రబాబు మాట్లాడడం సమంజసం కాదు.

– నరసింభరాజు, గుట్టపాడు, ఓర్వకల్లు మండలం

ఒక్క పథకం అందలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు నెలలు పూర్తయినా ఒక్క పథకం కూడా అందలేదు. గతంలో సీఎంగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం ప్రకటించిన తేదీకి సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా అందేవి. నాలుగేళ్ల పాటు జగనన్న చేయతూ కింద రూ. 18వేల సకాలంలో తీసుకున్నాం. అయితే సీఎం చంద్రబాబు నాయుడు కూడా మాట చెప్పిన ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి.

– లక్ష్మీదేవి, తిప్పాయిపల్లె,ఓర్వకల్లు మండలం

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



కూటమి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నిరుద్యోగికి ప్రతి నెల రూ. 3,000 ఇవ్వాలి. అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబునాయుడే సూపర్‌సిక్స్ పథకాలు చూస్తే భయమోస్తోందని అనడం విడ్డూరం. కుంటి సాకులు చూపుతూ ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం సమంజపం కాదు. రాష్ట్రంలో నిరుద్యోగ యువకులు భృతి కోసం ఎదురు చూస్తున్నారు. అన్యాయం చేయొద్దు.

– ఎర్రబం అనిల్‌కుమార్‌రెడ్డి, పాణ్యం

తల్లికి వందనం కోసం ఎదురు చూపు



తల్లికి వందనం పథకం కింద సాయం కోసం ఎంతో మంది విద్యార్థుల తల్లులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల వేళ విస్తృత ప్రచారం చేసిన చంద్రబాబునాయుడు అసెంబ్లీలో మాటమార్చి ప్రసంగించిన తీరు బాగలేదు. ఇక మంత్రి నారా లోకేష్ సైతం తల్లికి వందనం ఈ ఏడాది లేనట్టే అని ప్రకటించడం సమంజసం కాదు. నా కుమారుడు గడివేముల జెడ్పీ పాఠశాలలో 6వ తరగతి, కస్తూర్బాలో కుమార్తె ఇంటర్ చదువుతుంది. ఇప్పటికైనా న్యాయం చేయాలి.

– బానాల సునీతా, గడివేముల

పెట్టుబడి సాయం ఇవ్వరా ?



మాజీ సీఎం వైస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం అందించారు. క్రమం తప్పకుండా రైతులకు ఎరువులు, విత్తనాలు అందాయి. చంద్రబాబు పెట్టుబడి సాయం రూ. 20వేలు ఇస్తామని చెప్పారు. రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చారు తప్పా పెట్టుబడి సాయం లేదు. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందజేసి రైతులను ఆదుకోవాలి.

–రామాలక్ష్మయ్య భూపనపాడు

- బాబు పాలనకు వంద రోజులు
- రైతుల పెట్టుబడి సాయానికి మొండి చెయ్యి
- అతీగతీ లేని అమ్మకు వందనం
- టీడీపీ సర్కార్ తీరుపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకత

సూపర్ సిక్స్... అమలు ఎప్పుడు?

సూపర్ సిక్స్ అంటూ ఓటర్లను మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు నాయుడు కనీసం ఒక్క హామీని సక్రమంగా అమలు చేయడం లేదు. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై అన్నివర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులే కాదు చివరకు మద్యం ప్రియులకు సైతం వరాలు వర్షంలా కురిపించారు చంద్రబాబు. ఇక మహిళలను ఆకాశానికి ఎత్తారు. మీ ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తామంటూ నమ్మబలికారు. అమ్మఒడిని మించి సాయం అందజేస్తా... ఎంత మంది ఉంటే అంతమందికి ఒక్కో విద్యార్థికి రూ. 15 చొప్పున తల్లుల ఖాతాల్లో జమ చేస్తాం....ప్రతి మహిళకు రూ. 1,500 అందజేస్తా... అంటూ ఊదరగొట్టారు. ఇక రైతు భరోసా ఏకంగా రూ. 20 వేలు ఇస్తానంటూ అన్నదాతను మభ్యపెట్టాడు కూడా. సూపర్ సిక్స్ అంటూ వేరీవెరీ సూపర్‌గా ఓటర్లను మాయజేసిన చంద్రబాబు...పథకాల అమలుపై స్పష్టత ఇవ్వని తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. యువతకు ఉద్యోగాలిస్తాం... లేదంటే రూ. 3వేలు నిరుద్యోగ భృతి అందజేస్తామంటూ ఆశ పెట్టి పట్టించుకోని చంద్రబాబు తన నైజాన్ని చూపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాలను ఎంతో సూపర్‌గా ఎన్నికల ప్రచారంలో ఊరువాడ దప్పుకొట్టిన చంద్రబాబు... అసెంబ్లీ సాక్షిగా సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలంటే భయమేస్తుందంటూ ప్రజలను మభ్యపెట్టేందుకు చేసిన ప్రయత్నాన్ని చీదరించుకుంటున్నారు అన్నివర్గాల ప్రజలు. రేపోమాపో కూటమి ప్రభుత్వ తీరుపై తిరుగుబాటు తప్పదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

పాణ్యం: 2024సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు అంటూ వీపరితమైన ప్రచారం చేశారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం ప్రతి ఇంటికీ సూపర్‌సిక్స్ పథకాలు అంటూ ఊదరగొట్టారు. మేము కూడా మీ ఇంటికే నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తామంటూ ప్రజలను నమ్మించారు. ఏకంగా కరపత్రాలు పంచి మరీ ప్రజలను మభ్యపెట్టారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు గడుస్తున్నా కనీసం సూపర్ సిక్స్ పథకాల అమలు తీరుపై సీఎం చంద్రబాబు స్పష్టత ఇవ్వని తీరుపై పాణ్యం నియోజకవర్గ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకించి ఇటీవల జరిగిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. ఈ ఏడాదికి ఎలాంటి పథకాలు ఇవ్వట్లేదు అన్నట్లుగా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో 2019–24 మధ్య కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి ఆదుకున్న విషయాన్ని పాణ్యం నియోజకవర్గ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలుతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతామని ఆశపడ్డాం. ప్రభుత్వం నిరాశే మిగిల్చిందంటూ చాలా మంది పేదలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కోడుమూరు రూరల్: చంద్రబాబుతోపాటు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులు కురిపించిన హామీల జల్లులుపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. అధికారం చేపట్టి వందరోజులవుతున్నా కనీసం సూపర్ సిక్స్ పథకాల అమలు తీరుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వ తీరును కోడుమూరు నియోజకర్గ ప్రజలు తప్పుపడుతున్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు హామీలను గుర్తు చేసుకుంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో పేదల బతుకులు బాగుపడతాయి. 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500, ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమంది పిల్లలకు రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో నగదు జమ చేస్తాం. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి ఏకంగా రూ.20 వేలు ఇస్తామంటూ చంద్రబాబు నమ్మబలికిన హామీలను గుర్తు చేసుకుంటూ నిట్టూర్చుతున్నారు నియోజకవర్గ ప్రజలు. సూపర్ సిక్స్ మాట దేవుడెరుగు మాజీ సీఎం జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలకు సైతం మంగళం పాడారంటూ కూటమి పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతికి ఎదురుచూపులు



పాణ్యం ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి

మొత్తం గృహాలు, నిరుద్యోగ భృతి రూ.3000	అందాల్సిన నగదు కోట్లలో
45,320	13.59

కోడుమూరు ఇంటికో ఉద్యోగం , నిరుద్యోగభృతి

మొత్తం గృహాలు, నిరుద్యోగ భృతి రూ.3000	అందాల్సిన నగదు కోట్లలో
21,500	6.45 కోట్లు

ఏడాది దాటవేత దిశగా తల్లికి వందనం



పాణ్యం,కోడమూరు నియోజకవర్గాల్లో ఏడాది సూపర్‌సిక్స్ పథకాలు అందకపోవడంతో నష్టపోయిన లబ్ధిదారులు వివరాలు

తల్లికి వదంనం	విద్యార్థులసంఖ్య	అందాల్సిన నగదు రూ. కోట్లలో
మొత్తం	80,539	120.80

తల్లికి వదంనం	విద్యార్థులసంఖ్య	అందాల్సిన నగదురూ. కోట్లలో
మొత్తం	47,981	రూ.71.97 కోట్లు



నవరత్నాలు

కోడుమూరు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల కింద చేకూరిన లబ్ధి..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ఖాతాల్లో జమైన నగదు
అమ్మ ఒడి	47,981	రూ.249.50 కోట్లు
రైతుభరోసా	57,164	రూ.385.85కోట్లు

2019-2024 సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఇచ్చిన రైతు భరోసా పాణ్యంలో

సంవత్సరం	రైతులు	రైతు భరోసా నిధులు రూ.కోట్ల
2019-20	50,230	6.52
2020-2021	51,531	66.99
2021-22	52,221	67.88
2022-23	52,561	68.32

2019-2024 పాణ్యం నియోజకవర్గంలోని అమ్మ ఒడి ద్వారా చేకూరిన లబ్ధి వివరాలు

సంవత్సరం	విద్యార్థుల సంఖ్య	రూ.కోట్లు
2019-20	78,539	11.78
2020-21	79,621	11.94
2021-22	80,260	12.03
2022-23	80,430	12.06

అన్నదాత సుఖీభవ మొత్తం రైతులు



అన్నదాత సుఖీభవ మొత్తం రైతులు(పాణ్యం)	అందాల్సిన నగదు రూ. కోట్లలో
మొత్తం 52,719	105,54

అన్నదాత సుఖీభవ మొత్తం రైతులు(కోడుమూరు)	అందాల్సిన నగదు రూ. కోట్లలో
57,164	రూ.144.32కోట్లు

మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. 18సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు మహిళా శక్తి పథకం కింద నెలకు రూ.1,500 ఇస్తామని చెప్పారు. ఇంతవరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఎప్పటి నుంచి ఇస్తారో కూడా చెప్పడం లేదు. అసలు ఇస్తారా.. లేదా అనే అనుమానం వస్తుంది. ప్రభుత్వ తీరు మార్చుకోవాలి

– బొజ్జమ్మ, తిమ్మందొడ్డి

ఆడబిడ్డ నిధిపై నోరు మెదపని ప్రభుత్వం


ప్రతి మహిళకి నెలకు రూ. 1,500



(పాణ్యం)

ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 మహిళలు మొత్తం	అందాల్సి నగదు రూ.కోట్లలో
1,62,089	24,3
కోడుమూరు	
70,431	రూ.10.56కోట్లు

రైతులకు అన్యాయం చేయొద్దు



గత ప్రభుత్వ హయంలో రైతులకు ఆర్‌బీకేలు అండగా నిలబడేవి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే పెట్టుబడి సాయం రైతుభరోసా నగదు అందేది. రోజుల వ్యవధిలో విత్తనాలు, ఎరువులు ఆర్‌బీకేల ద్వారా అందజేసేవారు. నేటికీ రైతులకు పెట్టుబడి సాయం అందజేయకపోవడం చాలా అన్యాయం.

– ప్రతాప్‌రెడ్డి, నెరవాడ పాణ్యం మండలం

నిరుద్యోగ భృతి ఊసే ఎత్తట్లేదు



సీఎం చంద్రబాబు 2014 ఎన్నికల్లో నూ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తా మని హామీ ఇచ్చి అమలు చేయలేదు. అదేవిధంగా 2024 ఎన్నికల్లోనూ నిరుద్యో గులకు నెలకు రూ.3వేలు భృతి ఇస్తా మంటూ హామీలు గుప్పించారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయినా నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వడం లేదు. త్వరగా నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ప్రకటన చేస్తే బాగుంటుంది.

– నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

సాగుకు పెట్టుబడి సాయం అందించాలి



వ్యవసాయాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. ఇప్పటికీ పెట్టుబడి సాయాన్ని అందించకపోవడం అన్యాయం. సాగుకు అప్పులు చేయాల్సి వచ్చింది. జగనన్న పాలనలో ఎప్పటికప్పుడు పెట్టుబడి సాయం అందేది. సీఎం చంద్రబాబు ఎప్పటిలాగే రైతులను పట్టించుకోవడం లేదు. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయాన్ని అందజేసి ఆదుకోవాలి.

– తిమ్మగురుడు, సి.బెళగల్

రూ. 1500 ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు ప్రతి మహిళకు నెలకు రూ. 1,500లు ఇవ్వాలి. ఈ నగదు ఎప్పుడు ఇస్తారని ఎదరు చూస్తున్నారు. ఈ ఏడాది సూపర్‌సిక్స్‌లు అందించలేమని సీఎం పరోక్షంగా చెప్పడం మహిళలను మోసం చేసినట్లవుతుంది. మరోమారు ఆలోచించి మహిళలకు ప్రతినెలా రూ. 1500లు అందించి హామీని నిలబెట్టుకోవాలి.

– కవిత, పాణ్యం

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



కోడుమూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

కోడుమూరు రూరల్: స్వచ్ఛతా హిసేవ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేయించాలని డీపీఓ నాగరాజనాయుడు మండల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కోడుమూరులో చేపట్టిన పారిశుద్ధ్య పనులను బుధవారం డీపీఓ తనిఖీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజులను డీపీఓ ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యరత్న, ఈఓ అజయ్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోండి



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ

గడివేముల: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ -1 వంగాల మహేష్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రం గడివేములలోని జెడ్పీటీసీ స్వగృహంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రంథాలయం కొన్నేళ్లుగా అద్దె భవనంలో ఉండేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శాశ్వత భవనం ఉండాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని స్థలం కేటాయించి, గ్రంథాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు వెంటనే పనులు ప్రారంభించామన్నారు. తమ ప్రభుత్వంలోనే గ్రంథాలయం నిర్మాణం పూర్తయిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభానికి నోచుకో లేదన్నారు. అయితే ఈ నెల 5వ తేదీన ప్రారంభించగా ప్రొటోకాల్ పాటించని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

కంబదహాల్‌లో స్వచ్ఛతపై ర్యాలీ

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను బుధవారం అధికారులు నిర్వహించారు. రెండవ రోజు మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులో పంచాయతీ కార్యదర్శి అభిషేకం స్వచ్ఛత పరుగు, మర్థాన్ రేసు, ప్రజలకు, గ్రామ పారిశుద్ధ్య కూలీలకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతో పాటు పరిసరాల శుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు, గ్రామస్తులు రాముడు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి



వంతెనపై ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: గుంతలమయంగా మారిన కోడుమూరు హంద్రీనదిపై ఉన్న వంతెనకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గుంతలమయంగా మారిన కోడుమూరు హంద్రీ వంతెనపై సీపీఐ, చేనేత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. రాజు మాట్లాడుతూ కర్నూలు నుంచి బళ్ళారి, పత్తికొండ, గుంతకల్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో కోడుమూరు వద్ద హంద్రీపై ఉన్న వంతెన పూర్తిగా దెబ్బతినిందన్నారు. ఏళ్ల తరబడి అధికారులు వంతెన మరమ్మతులను పట్టించుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతిని ప్రమాద ఘంటికలు మోగిస్తుందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాధవస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం తాలుకా కార్యదర్శి శేషుకుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

కల్లూరు: ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం బస్తిపాడు లే అవుట్‌ను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే పెద్దటేకూరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారి కేంద్రాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించారు.

ఉపాధి లక్ష్యాలపై సమావేశం

కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ఏపీడీ లక్ష్మన్న ఉపాధి పథకం కింద నిర్దేశించిన లక్ష్యాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన డీఈఈ



కొత్తకోట రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న డీఈ శివరుద్ర

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నదీతీర గ్రామాల్లో జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం డీఈ శివరుద్ర తనిఖీ చేశారు. ఏఈ ఫిబీతో కలిసి కొత్తకోట గ్రామం నుంచి కె.సింగవరం గ్రామం వరకు చేపట్టిన సీసీ రోడ్డు, కల్వర్టులను పరిశీలించారు. డీఈ రోడ్డును కొంతమేర తవ్వి నాణ్యత తనిఖీ చేశారు.

పైపులైన్ పనులను పరిశీలించిన ఏఈ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సర్పంచ్ చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్ పరిశీలించారు. రూ.1.5 లక్షల పంచాయతీ నిధులతో ప్రధాన వీధితోపాటు, కమ్మ, గొల్ల, సొంతప్ప వీధులలో చేపట్టిన పైప్‌లైన్, కులాయిల ఏర్పాటు పనులను సర్పంచ్ పాండురంగన్నతో కలిసి ఏఈ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గ్రామాల శుభ్రతే ప్రభుత్వ లక్ష్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీపీఓ మంజులవాణి

పాణ్యం: గ్రామాల అభివృద్ధి, శుభ్రతే ప్రభుత్వ లక్ష్యమని డీపీఓ మంజులవాణి ప్రారంభించారు. మండల కేంద్రం పాణ్యంలో రెండవ రోజు బుధవారం స్వచ్ఛతహి సేవ కార్యక్రమాన్ని డీపీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఎక్కడ మురగు నీరు కనబడినా తక్షణమే ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. అనంతరం ర్యాలీని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. పాణ్యంలోని నాగులు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగసుంకమ్మ, ఏపీఓ విజయరాణి, ఎంఈఓ–2సుబ్రహ్మణ్యం, సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ ఆనందరావు, ఈఓఆర్డీ సులోచన తదితరులు పాల్గొన్నారు.